

# వల

పంచా నాగేంద్ర త్రినాథ్

ట్రెజరీ ఆఫీసు అంతా హడావిడిగా వుంది. ఆరు నెలల తర్వాత బిల్స్ ఇస్తున్నారు. ఆ మాత్రం సందడి మామూలే. కృపావరం సెక్షన్ మరీ సందడిగా కనిపిస్తోంది. ఏ కాంట్రాక్టరుకు వరమిస్తాడో... ఎవరికి సొమ్ము లేదు పొమ్మంటాడో... కాంట్రాక్టర్లు ఆందోళనగా కనబడ్డారు.

"నమస్తే సార్ కృపావరం గారు!" కాంట్రాక్టర్ రామకృష్ణ లోపలికి వస్తూనే బాణం వేశాడు.

"ఆ... నమస్తే... నమస్తే. రండి బాబూ. మహానుభావులు. వస్తామంటారు కాని మళ్లీ కనబడరు. పోయినసారి బిల్లు చేయించుకున్నారు. అదిగో ఇదిగో అన్నారు. మళ్లీ ఇప్పటికి వచ్చారు" కృపావరం మనసులో బాధను వెళ్లగక్కాడు.

"సొమ్ములెక్కడున్నాయి చెప్పండి... ఈ ఆరు నెలల్లో ఒక్క బిల్లు అయ్యిందా. మీరే చూస్తున్నారుగా. ప్రభుత్వం పని చేయించుకోవటం తప్ప బిల్లు ఎక్కడ ఇస్తోంది చెప్పండి!" పరిస్థితి వివరించాడు రామకృష్ణ. "కాస్త ఈ మూడు లక్షల బిల్లు పాస్ చేయించి పుణ్యం కట్టుకోండి. మీ బాకీ తీర్చేస్తా."

"ఏమిటి? పాత దాని సంగతి చెబుతున్నారు. దీని సంగతేమిటి?" కృపావరం ప్రశ్న.

"భలేవారే! మీ కృప లేకుండా బిల్లు అవుతుందా. ఆ మాత్రం నాకు తెలియదా!"

"చూడండి రామకృష్ణ గారు! నా దగ్గరకు వచ్చిందే 36 లక్షలు. ఇప్పటికే 30 లక్షలు వరకూ చెక్‌లకు అనుమతి రాసి బ్యాంకుకు పంపా. మీరు నాన్చకుండా ఏదో ఒక మాట చెబితే నేను చేసుకు పోతా..." కృపావరం తొందర పెట్టాడు.

"అలాగైతే విషయంలోకి వద్దాం. మొన్నటి బిల్లుకు మీకు అయిదు వందలు ఇస్తానన్నాను. దీనికో ఆరు వందలు ఇస్తాను" రామకృష్ణ తన మనసులో మాట చెప్పాడు.

"మీరు బాగానే చెప్తారు. ఇదంతా నా జేబులో పడుతుందా. ఇవన్నీ వసూలు చేసి నేనూ లెక్క చెప్పాలి కదా. మా పైవాళ్లకు పంచాలా. అన్నీ పోతే నాకు చివరకు వందో నూటయాభయ్యో మిగులుతాయి. మీకు ఇవన్నీ తెలియనివి కావు కదా. అసలు బిల్స్ ఏమన్నా వస్తుంటే మీరూ తగ్గించినా ఫరవాలేదు. ఇక్కడ అసలుకే ఎసరు. నా మాట కాదనకుండా ఆ రెండువేలూ కానిచ్చేయండి" కృపావరం రేటు ఫైనల్ చేస్తూ తొందరపెట్టాడు.

"బొత్తిగా గేదెల బేరం అనుకోకండి. మా పరిస్థితి మాత్రం మీకు తెలియదా. ఎంతమందికి పంచాలి. రింగ్ టెండర్‌కే చాలా ఖర్చయింది. ఈసారికి పదిహేను వందలకు చెయ్యండి. తర్వాత చూద్దాం" రామకృష్ణ పరిస్థితి చెప్పాడు.

"సరే బాబూ... కానీయండి. రండి మరి తీయండి" కృపావరం విసుగుగా అన్నాడు.

"ఇప్పుడే వచ్చేస్తా. మీరు రాయండి."

"ఏమిటి మళ్లీ అరువా?"

"ఛఛ... తేవటానికి వెళుతున్నా."

"త్వరగా రండి. మళ్లీ బ్యాంకు టైమ్ అవుతోంది."

ఇరువురి మధ్య సంభాషణ నడిచింది. రామకృష్ణ మాట్లాడుతూనే బండి తీశాడు. దూరంగా స్కూలు వ్యాను వుంటే అందులోకి వెళ్లాడు. లోపల వున్న వ్యక్తులతో మాట్లాడాడు.

"ఒప్పుకున్నాడా?"

"అంతా ఓకే సార్"

"ఎంతకి?"

"పదిహేను వందలకు"

"క్యాష్ ఉందా?"

"తెచ్చాను సార్"

"సరే ఇవ్వండి" లోపలి వ్యక్తి రామకృష్ణ నుంచి డబ్బు తీసుకుని తిరిగి అతనికే ఇచ్చాడు.

రామకృష్ణ ఆ సొమ్ము తీసుకుని కృపావరం సీటు వద్దకు వచ్చాడు.

"ఏం మహానుభావా! తెచ్చావా!"

"మీకు గొప్ప అనుమానం సుమా. ఇదిగో చూడండి" పదిహేను వందలు బయటకు తీశాడు.

"థాంక్స్ నాయనా. లెక్కలు చెప్పలేక ఛస్తున్నా" కృపావరం బాధగా అన్నాడు.

"ఈ దెబ్బతో నీ పీడ ఈ ఆఫీసుకు వదిలిపోతుందిలే. తీస్కో... తీస్కో..." మనసులోనే అనుకున్నాడు రామకృష్ణ.

"బిల్లు చేశాను. ఇక్కడో సంతకం చేయండి" అని చెప్పి రామకృష్ణతో సంతకం చేయించుకున్నాడు.

సార్... ఆ క్యాష్...

"ఉండండి సార్... తీసుకుంటా. లోపల నా మొగుడున్నారుగా. అంతా అనుమానం. మీ దగ్గర ఏదో వేలకు వేలు లాగేశానని ఆయనగారి భ్రమ. అందుకే ఆయన వద్ద లోపల ఇద్దురుగానీ రండి..." కృపావరం సలహాగా చెప్పాడు.

"నడునడు... టైంబాంబుకు రెడీ అవ్వు. అయిపోయావులే. పైగా ఆఫీసర్ సమక్షంలో భలే ఛాన్సు..." రామకృష్ణ నవ్వుకున్నాడు.

ఆఫీసర్ రూంలోకి వెళ్లగానే కృపావరం టేబుల్‌పై కాగితాలు పెట్టాడు. ఆఫీసర్ ఆవలివైపునకు కుర్చీ తిప్పి కూర్చున్నాడు.

"సార్... కాంట్రాక్టర్ రామకృష్ణగారు వచ్చారు. పాత బాకీ కూడా తెచ్చారు. మొత్తం పదిహేను వందలకు అంగీకరించాను"

"అవన్నీ నావద్ద ఎందుకయ్యా" ఆఫీసర్ గంభీరంగా అన్నాడు.

"ఎలాగూ మీకు ఇవ్వాలి కదా అని... నేనైతే మళ్లీ పులుసులో వేస్తానని..." నసిగాడు కృపావరం.

"సరె సర్లే... ఇవ్వమను"

ఆఫీసరు కుర్చీ తిప్పి రామకృష్ణ వైపు తిరిగారు.

వెంటనే రామకృష్ణ పదిహేను వందలు ఆయన చేతికి ఇచ్చారు.

కనురెప్పపాటులో నలుగురు వ్యక్తులు లోపలికి వచ్చి రామకృష్ణను పట్టుకున్నారు.

చేతులు విదుల్చుకుని, "నన్ను కాదోయ్ బాబూ... వాళ్లని పట్టుకోండి" అంటూ రామకృష్ణ కోపంగా అన్నాడు.

"లేదు మిస్టర్! నువ్వు అనుకున్నట్లు మేం ఎ.సి.బి. వాళ్లం కాదు. నువ్వు వలపన్ని పట్టించాలని ఎరేంజ్ చేసినవారు స్కూల్ వ్యాన్‌లోనే వున్నారు. మేం లోకల్ పోలీసులం..."

"అవును రామకృష్ణా! నేను ఆఫీసర్‌ను కాదు. లోకల్ సి.ఐ.ని– ఈపాటికి గుర్తుపట్టే వుంటావు" అంటూ సి.ఐ. టోపీ పెట్టాడు.

రామకృష్ణ అవాక్కయ్యాడు.

"చూడు మహానుభావా! నన్ను పట్టించాలని నువ్వు ఐదువేలకు బేరం కుదుర్చుకున్న ఎ.సి.బి. క్లర్క్ ఎవరో తెలుసా? నేను అల్లుడుగా కుదుర్చుకున్నవాడే"

రామకృష్ణ నోటమాట రాలేదు.

●